నమస్తే తెలంగాణ
పెద్దపల్లి
5 | కరీంనగర్, బుధవారం 17 జూలై 2024 | PEDDAPALLI

రేపటి నుంచే డీఎస్సీ ఎగ్జామ్

ఆగస్టు 5 వరకు నిర్వహణ

పెద్దపల్లి కమాన్, జూలై 16: డీఎస్సీ 2024 పరీక్షలను ఈ నెల 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు పెద్దపల్లి డీఈవో డీ మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 7,150 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, వీరి కోసం పెద్దపల్లి జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మొదటి సారిగా కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటాయని చెప్పారు. అభ్యర్థులు రెండు గంటల ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. నిర్ణీత సమయానికి గంట న్నర ముందు నుంచి లోపలికి అనుమతిస్తారని, 10 నిమిషాల ముందు గేట్లు మూసి వేయడం జరుగుతుందని వివరించారు. అభ్యర్థులు తప్పనిసరిగా తమ హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు కార్డు, బాల్ పాయింట్ పెన్ను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

మాటుకుంట కట్టకు కోత

కొడిమ్యాల మండల కేంద్రం నుంచి సూరంపేట వెళ్లేదారిలో కోనాపూర్ గ్రామ శివారులోని మాటుకుంట కట్ట కోతకు గురవుతున్నది. వానకాలంలో భారీగా కురిసిన వర్షాలకు ఈ కట్ట పూర్తిగా ధ్వంసమవగా, స్పందించిన అప్పటి అధికారులు తాత్కాలికంగా మట్టి పోసి రహదారిని పునరుద్ధరించారు. కాగా, సోమవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డును ఆనుకొని ఉన్న కట్ట కోతకు గురైంది. కట్టకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- కొడిమ్యాల, జూలై 16

కోతకు గురైన మాటుకుంటను చూపుతున్న రైతు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల మానేరు వాగులో అయ్యప్ప ఆలయం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు నిర్మించిన కరకట్ట (ఫైల్)

ప్రభుత్వం మారడంతో పనులు నిలిచి పోయి పిచ్చిమొక్కలు, కందకాలతో మూసుకు పోతున్న 60ఫీట్ల కరకట్ట

పర్యాటకంపై పట్టింపేది?

- సిరిసిల్ల మానేరును గాలికొదిలేసిన రాష్ట్ర సర్కారు
- రాష్ట్ర ప్రజల వీకెండ్ స్పాట్‌గా మార్చేందుకు గత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- మానేరు బ్రిడ్జి కుడివైపున ₹30కోట్లతో కరకట్ట పనులు
- ప్రభుత్వం మారడంతో నిలిచిన నిర్మాణం
- రూ.కోట్లు పెట్టి పోసిన మట్టి వాగుపాలయ్యే ప్రమాదం
- పట్టించుకోని యంత్రాంగం

సిరిసిల్ల మానేరు తీరం కళ తప్పుతున్నది. ఎక్కడికక్కడ నిలిచిన పనులతో అధ్వానంగా కనిపిస్తున్నది. చుట్టూ గుట్టలు.. మధ్యలో నీటి గలగలలు.. పచ్చల హారాల్లాంటి ఉద్యాన వనాలతో ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని గత కేసీఆర్ ప్రభుత్వం సంకల్పించి పనులు చేపట్టగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు గాలికొదిలేసింది. మానేరు బ్రిడ్జి కుడివైపున ₹30కోట్లతో కరకట్ట మీటరు ఎత్తు వరకు నిర్మించడం, ప్రస్తుతం పట్టించుకునేవారే లేకపోవడంతో ₹కోట్లు పెట్టి పోసిన మట్టి వాగుపాలయ్యే ప్రమాదం కనిపిస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, పనులు పూర్తి చేసి దశాబ్దాల తమ కల నెరవేర్చాలని ప్రజానీకం కోరుతున్నది.

రాజన్న సిరిసిల్ల, జూలై 16 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల మానేరు సహజ సిద్ధ అందాలతో అలరారుతున్నది. అయితే మధ్యమానేరు నిర్మాణం, ఆ తర్వాత ఎదురెక్కి వచ్చే గోదావరి జలాల పరవళ్లతో జలకళను సంతరించుకున్నది. చుట్టూ గుట్టలు.. మధ్యలో నీటి గలగలలు.. పచ్చల హారాల్లాంటి ఉద్యాన వనాలతో కనువిందు చేసేది. ఓ వైపు రామప్ప గుట్టలు, మధ్యలో పరుచుకున్న మానేరు వాగుతో సూపర్‌లోకేషన్‌గా మారింది. ఈ క్రమంలో మానేరు వాగు, రామప్ప గుట్టలను కలుపుకుని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే, అప్పటి మంత్రి కేటీఆర్ సంకల్పించారు. హైదరాబాద్ ప్రజలకు వీకెండ్ స్పాట్‌గా తీర్చిదిద్దాలని భావించారు. విశాఖ బీచ్‌ను తలపించేలా మానేరు బ్రిడ్జి కుడివైపు నుంచి అయ్యప్ప ఆలయం దాకా 100ఫీట్ల కరకట్ట నిర్మించాలని ప్రతిపాదనలు చేయగా, 60 ఫీట్లకు కుదించారు. అందుకు ఇరిగేషన్, మున్సిపాలిటీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సర్వేలు చేసి మొదటి విడతగా ₹30కోట్ల అంచనాలతో ప్రణాళికలు సిద్ధం చేసి పనులు ప్రారంభించారు. ఇదేగాక మానేరు బ్రిడ్జి వద్ద, బతుకమ్మ ఘాట్, నెహ్రూనగర్ అంభ భవానీ ఆలయం, అయ్యప్ప ఆలయం వద్ద పార్కులు, సైకిల్ ట్రాక్, చిన్నారుల ఆటస్థలాలు, ఫౌంటేయిన్లు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు.. ఇలా సందర్శకులను ఆకట్టుకునే పనులకు మాజీ మంత్రి ప్రత్యేక చొరవ చూపారు. మానేరులో షికారుకు బోటును సైతం ప్రారంభించారు. కానీ, ప్రభుత్వం మారడంతో టూరిజం ప్రాజెక్టు నిలిచిపోయింది.

రూ.కోట్లు వాగుపాలేనా?..

పర్యాటక కేంద్రంగా మార్చే క్రమంలో అయ్యప్ప ఆలయం నుంచి మానేరు కుడివైపు బ్రిడ్జి వరకు మూడు కిలోమీటర్ల మేర మానేరు వాగు పక్కన కరకట్ట నిర్మించారు. గతేడాది జనవరిలోనే పనులు ప్రారంభించారు. ₹కోట్లు ఖర్చుపెట్టి 60ఫీట్ల రోడ్డు కోసం మట్టి పోశారు. మీటరు ఎత్తు వరకు పనులు చేశారు. అయితే ప్రభుత్వం మారగానే నిలిచిపోయాయి. ఇప్పటికే రోడ్డుపైన గుంతలు పడి వర్షపు నీరు పారుతుంది. పిచ్చిమొక్కలు మొలిచి 60ఫీట్ల రోడ్డు సగానికి చేరుకుంది. అయితే భారీ వర్షాలకు వాగొచ్చి కోట్లు వ్యయం చేసిన పోసిన మట్టి కొట్టుకు పోయే ప్రమాదమున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కరకట్ట పనులు ప్రారంభించి, తమ కల సాకారం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చీరెలు కొంటడు.. ఉడాయిస్తడు

- ఫోన్‌పేలో డబ్బులు పంపిస్తానని మోసం
- ఫేక్ మెసేజ్ చూపి గాయబ్
- ఇది కేటుగాడి స్టైల్
- తాజాగా జగిత్యాలలో అరెస్ట్

జగిత్యాల, జూలై 16 : ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. రోజుకో తరహాలో ఆన్‌లైన్ మోసాలు భయపెడుతున్నాయి. కొద్ది రోజులుగా ఫేక్ ఫోన్‌పే ఫ్రాడ్స్ కలవరపెడుతున్నాయి. మహిళలు నడిపించే షాపులను టార్గెట్ చేసి, చీరలో.. మరే వస్తువో కొని.. డబ్బులు పంపానని ఫేక్ మెసేజ్ చూపి గాయబ్ అవుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి తరహాలోనే మోసానికి పాల్పడిన ఓ వ్యక్తిని తాజాగా జగిత్యాల పోలీసులు అరెస్ట్ చేశారు. అందుకు సంబంధించిన వివరాలను టౌన్ సీఐ వేణుగోపాల్ వెల్లడించారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన రామగిరి సురేశ్ నయా మోసానికి తెరతీశాడు. శుక్రవారం నంబర్‌ప్లేట్ లేని పల్సర్‌పై జగిత్యాలలో ఒక బట్టల షాపునకు వెళ్లాడు. ₹2200 విలువైన మూడు చీరెలను కొనుగోలు చేశాడు. తన వద్ద నగదు డబ్బులు లేవని, ఫోన్‌పే చేస్తానని చెప్పాడు. అలాగే తనకు డబ్బులు అత్యవసరం ఉందని మరో ₹7800 తీసుకున్నాడు. మొత్తం ₹10 వేలు పంపిస్తానని చెప్పాడు. స్కానర్‌తో పంపితే రావడం లేదని, ఇంకో ఫోన్ నంబర్ చెప్పాలని యాజమానురాలిని అడిగాడు. ఆమె మరో నంబర్ చెప్పడంతో డబ్బులు పంపించానని ఫేక్ మెసేజ్ చూపించి ఉడాయించాడు. తన భర్త వచ్చిన తర్వాత ఫోన్‌పేలో డబ్బులు వచ్చాయా..? అని అడగ్గా.. రాలేదని చెప్పడంతో మోసపోయామని గ్రహించారు. ఆదివారం టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం విద్యానగర్ బైపాస్ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న సురేశ్‌ను పట్టుకుని విచారించారు. అతడి వద్ద నుంచి ₹5వేలు నగదును రికవరీ చేసి, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బదిలీలకు కసరత్తు పూర్తి

- ఆరు ప్రధాన దేవాలయాలుగా యూనిట్
- రాజన్న ఆలయంలో కేడర్ స్ట్రెంత్ 77 మందిగా గుర్తింపు
- 40 శాతంతో 25 మంది ఉద్యోగులకు బదిలీలు
- ఉత్తర్వులు వచ్చిన వారిని వెంటనే రిలీవ్ చేస్తాం : ఈవో

దేవాదాయ శాఖలో పరిపాలనా పరమైన ఉద్యోగులను మాత్రం బదిలీ చేస్తామని మొదటి నుంచి చెబుతున్నట్టుగానే 40 శాతం మంది ఉద్యోగుల బదిలీలకు కసరత్తు పూర్తయింది. ఇక రాజన్న ఆలయంలో 144 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తుండగా వీరి వివరాలను ఇప్పటికే దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు పంపారు. ఈ నివేదిక ఆధారంగా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు కేడర్ స్ట్రెంత్‌ను గుర్తించారు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న 63 మంది ఉద్యోగుల ఆధారంగా 40 శాతం బదిలీ అయ్యే కేడర్ వివరాలను వేములవాడ రాజన్న ఆలయ పరిపాలన కార్యాలయానికి పంపారు. పరిపాలనా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా బదిలీ అయిన వారిని వెంటనే రిలీవ్ చేసి కొత్త వారిని తీసుకుంటామని ఇన్‌చార్జి ఈవో వినోద్ రెడ్డి తెలిపారు.

వేములవాడ, జూలై 16: రాష్ట్ర దేవాదాయ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రస్తుతానికి 6ఏ పరిధిలోని దేవాలయాలను ఒక యూనిట్‌గా చేసి బదిలీ ప్రక్రియ నిర్వహించనున్నారు. అందులో వేములవాడ, యాదగిరిగుట్ట, కొండగట్టు, కొమురవెల్లి, భద్రాచలం, బాసర దేవాలయాలను కలిపి ఆరు దేవాలయాలుగా యూనిట్‌గా ఏర్పాటు చేశారు. ఈ ఆలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ఆప్షన్‌ల ద్వారా ఈ ఆరు దేవాలయాల్లో ఎక్కడికైనా బదిలీ చేయవచ్చు.

రాజన్న ఆలయంలో కేడర్ స్ట్రెంత్ 77

వేములవాడ రాజన్న ఆలయంలో మొత్తం 214 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉండగా.. 70 మంది ఉద్యోగ విరమణ పొంది ఖాళీలుగా ఉన్నాయి. 144 మంది ప్రస్తుతం పని చేస్తున్నట్టుగా ఉన్నతాధికారులకు ఆలయ అధికారులు నివేదికలు పంపారు. దీని ఆధారంగా రాజన్న ఆలయంలో కేడర్ స్ట్రెంత్‌ను అధికారులు డిసైడ్ చేశారు. అందులో డిప్యూటీ కార్యనిర్వహణ అధికారి 1, సహాయ కార్యనిర్వహణ అధికారులు 4, పర్యవేక్షకులు 14, సీనియర్ అసిస్టెంట్లు 19, జూనియర్ అసిస్టెంట్లు 33, ఈఈ 1, డీఈ 2, ఏఈ 1, ఏఈ సివిల్ 2గా కేడర్ స్ట్రెంత్ 77 మందిని గుర్తించారు. అందులో ప్రస్తుతం పని చేస్తున్న 63 మందిని గుర్తించి, వారిలో 40 శాతం మంది అనగా 25 మంది ఉద్యోగులను బదిలీ చేయనున్నారు. 19వ తేదీతో ఆప్షన్‌లు ముగియనుండగా.. 20 నుంచి 27వ తేదీ వరకు కార్యాలయంలో పరిశీలించనున్నారు. 28, 29 తేదీల్లో బదిలీ ఉత్తర్వులను దేవాదాయశాఖ కమిషనర్ జారీ చేయనున్నారు.

చర్చనీయాంశంగా బదిలీలు

రాష్ట్రంలో బదిలీల ప్రక్రియ కొనసాగుతుండగా దేవాదాయ శాఖ ఉద్యోగుల బదిలీల అంశం మాత్రం చర్చకు దారితీసింది. అయితే, ఉద్యోగులతోపాటు అర్చకులను కూడా బదిలీ చేసేందుకు కసరత్తు చేస్తుండగా, ఇప్పటికే అర్చక సంఘాల నుంచి వ్యతిరేకత మొదలైంది. మరోవైపు దేవాదాయ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారంటూ భద్రాచలం అర్చకులు ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించగా, అర్చకుల బదిలీలపై స్టే ఇవ్వడంతోపాటు మూడు వారాల్లో సమాధానాలు ఇవ్వాలని సంబంధిత శాఖను ఆదేశించిన వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఉత్తర్వులు అందిన వెంటనే రిలీవ్ చేస్తాం

దేవాలయాల పరిధిలో జరుగుతున్న బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు అందిన వెంటనే ఉద్యోగులను రిలీవ్ చేస్తాం. పరిపాలన పరంగా ఇబ్బందులు కలుగకుండా వెంటనే రిలీవ్ చేసి వచ్చే శ్రావణ మాసం సందర్భంగా అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకుంటాం. కేడర్ స్ట్రెంత్‌ను గుర్తించి దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు పంపారు. బదిలీ ప్రక్రియను కూడా ఇప్పటికే నోటీసు బోర్డు ద్వారా ఉద్యోగులకు తెలియజేశాం.

- వినోద్ రెడ్డి, ఇన్‌చార్జి ఈవో (వేములవాడ)

మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు, పక్కన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

ప్రజా పాలన గాలికి..

- సీఎం దృష్టి అంతా ఎమ్మెల్యేల కొనుగోలు మీదనే ఉంది
- రైతులు, నిరుద్యోగులు ఇబ్బందులు పట్టవా..?
- మెజార్టీ రైతులకు ఎగ్గొట్టేందుకే రుణమాఫీకి కొత్త నిబంధనలు
- బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు ఫైర్

జగిత్యాల, జూలై 16: 'అది చేస్తాం.. ఇది చేస్తాం' అని గద్దెనెక్కిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనను గాలికొదిలేశారని, దృష్టంతా కేవలం ఎమ్మెల్యేల కొనుగోలు మీదనే పెట్టారని బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు విమర్శించారు. బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేసి, ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, రైతులు, నిరుద్యోగులను నిండా ముంచిందని మండిపడ్డారు. మక్క, పసుపు, వరి రైతులకు ఇస్తామన్న ఎకరాకు ₹15వేల రైతు భరోసా డబ్బులు ఎటుపోయాయో..? చెప్పాలని ప్రశ్నించారు. కనీసం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు కింద ఇచ్చిన ₹10వేలు కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారని, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను పక్కకు పెట్టి ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారని, మాట వినకపోతే భయపెట్టి, బ్లాక్ మెయిల్ చేస్తూ పార్టీలో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో తాము ఏనాడూ అలా చేయలేదని.. మీరూ చేయకపోతేనే మంచిదని హితవుపలికారు. రుణమాఫీ ప్రక్రియ అంతా బోగస్ అని, పీఎం కిసాన్ సమ్మాన్ నిబంధనలను తీసుకొని మెజార్టీ రైతులకు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగులు, యువతపై ప్రభుత్వం కక్షగట్టిందని, డీఎస్సీ పోస్టులు పెంచాలని, నోటిఫికేషన్లు వేయాలని ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. పార్టీలో నుంచి ఎవరు బయటికి వెళ్లిపోయినా నష్టమేమీ లేదని, జగిత్యాల నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు తాను, లోక బాపు రెడ్డి, దావ వసంత అందుబాటులో ఉంటామని, ఆపదలో అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఏదేదో మాట్లాడుతున్నారని, గతంలో కాంగ్రెస్ హయాంలో గ్రూప్స్ పరీక్షల్లో అవకతవకలు జరిగిన విషయాన్ని మర్చిపోయారా..? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో 1.31లక్షల ఉద్యోగాలు భర్తీ చేశామని, 26వేల ఉద్యోగాల భర్తీలో 75 శాతం ప్రాసెస్ చేస్తే, మీరు వచ్చి నియామక పత్రాలు మాత్రమే ఇచ్చారనే విషయాన్ని మర్చిపోవద్దని సూచించారు. నిరుద్యోగులపై చిత్తశుద్ధి ఉంటే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, మెగా డీఎస్సీ వేయాలన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ టైంలో తులం బంగారం గురించి కాంగ్రెస్‌ను ప్రశ్నించారని, మరి ఇప్పుడేమైందో..? ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ నాయకుడు లోక బాపురెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అనేక మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జగిత్యాల రూరల్ మండలం బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు పడిగెల గంగారెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కోల్కుల రమణ, కౌన్సిలర్లు తురగ శ్రీధర్ రెడ్డి, ఎలిగేటి అనిల్ కుమార్, మహేశ్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అమీన్ బాయ్, శీలం ప్రవీణ్, నక్క గంగాధర్, చింతల గంగాధర్, సల్మాన్, ఈతేమద్ ఉల్‌హాక్, పడిగెల గంగారెడ్డి, నీలి ప్రతాప్, ప్రణయ్, భగవాన్, గాజుల శ్రీనివాస్ ఉన్నారు.

నిరుద్యోగులను పట్టించుకోండి

పెద్దపల్లి గ్రంథాలయంలోని అభ్యర్థులతో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధూకర్

పెద్దపల్లి జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధూకర్

పెద్దపల్లి, జూలై 16: పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పెద్దపల్లి జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి సర్కారు నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నదని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ అంటేనే మోసాలు, కుంభకోణాలకు కేరాఫ్ అని తీవ్రంగా విమర్శించారు. పెద్దపల్లి జిల్లా గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా లైబ్రరీలో నెలకొన్న సమస్యలపై అభ్యర్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గ్రంథాలయ పరిస్థితి చూస్తే చాలా దారుణంగా ఉందని ఆవేదన చెందారు. కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు అభ్యర్థులకు అల్పాహారం, భోజన సదుపాయం కల్పించిందని గుర్తు చేశారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వర్షానికి అభ్యర్థులు ఇబ్బందులు పడుతుంటే జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నిరుద్యోగుల ఓట్ల మీద గెలిచిన కాంగ్రెస్, వాళ్లకిచ్చిన ఒక్క హామీ నెరవేర్చకుండా ప్రజాపాలన పేరిట దొపిడీ చేస్తున్నదని మండిపడ్డారు. గత ప్రభుత్వాన్ని నిందించడం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం తప్ప అధికారంలో వచ్చి ఏడు నెలలు దాటినా ప్రజాహితం కోసం చేసిందేమీ లేదని విమర్శించారు.

అభివృద్ధి అంటే ఇదేనా..?

కరీంనగర్ సర్కస్‌గ్రౌండ్ వెనుక రోడ్డును తవ్వి వదిలేయడంపై నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ వాల రమణారావు, స్థానిక ప్రజలు

కరీంనగర్ కార్పొరేషన్, జూలై 16: అభివృద్ధి పేరుతో రోడ్డును తవ్వేసి ఎనిమిది నెలలైనా పనులు ముందుకు సాగకపోవడంతో 60వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ వాల రమణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి అంటే ఇదేనా..? అని మండిపడ్డారు. రోడ్డుపై గుంతలతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సర్కస్ గ్రౌండ్ (జ్యోతి భాపూలే గ్రౌండ్) వెనుక స్థానికులతో కలిసి రోడ్డు మధ్యలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీఎం ఆస్యూరెన్స్ నిధులతో చేపట్టాల్సిన ఈ రోడ్డు అభివృద్ధి పనులను గాలికొదిలేశారని, ఎనిమిది నెలల కింద గుంతలు తవ్వి అలాగే వదిలేయడంతో మురుగు బయటకు వెళ్లే పరిస్థితి లేక అక్కడే నిలిచిపోతున్నదన్నారు. వర్షం పడితే ఎక్కడికక్కడ నీరు నిలిచి పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారన్నారు. దీనికితోడు ఈ రోడ్డు వెంట అండర్‌గ్రౌండ్ గుంతలు కూడా ఉన్నాయని, వర్షపు నీరు నిలుస్తుండడంతో ఏ గుంత ఎక్కడ ఉందో..? తెలియడం లేదని వాపోయారు. ఏమైందని..? కాంట్రాక్టర్‌ను అడిగితే తమకు బిల్లులు వస్తేనే పనులు చేస్తామని చెబుతున్నారని చెప్పారు. ఈ విషయంలో నగర కమిషనర్, కలెక్టర్, మంత్రి, ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, వెంటనే రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు. నిరసనలో సాయిరాం, జగన్‌మోహన్‌రావు, శ్యాం సుందర్, ప్రవీణ్, విజయరామారావు, ప్రసాద్, శ్రీనివాస్, అజీమ్, కొమురయ్య, పొచమల్లు, నాగరాజు, మల్లయ్య వెంకన్న, వెంకటరమణ ఉన్నారు.